క్లుప్తంగా

కూటమి నేతల కుతంత్రాలకు చెక్

మాచర్ల: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. గురువారం జరిగిన ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు డబ్బులు, అధికార బలంతో ఓట్లు వేయించుకునేందుకు నానా తంటాలు పడ్డారన్నారు. పీడీఎఫ్ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావును ఓడించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు కూటమి నేతలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్, వెంకట్రావు తదతరులు ఉన్నారు.

షిర్డి సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్‌లో ఉన్న షిర్డి సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గోపాల్ పాండే ఎంతో మహిమ కలిగిన సాయిబాబాని పూజిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని పేర్కొన్నారు. అనేక గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో సాయినాథుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో భజన బృందం బాబా గీతాలను ఆలపించింది. పాలువాయిగేటు గ్రామానికి చెందిన దారపునేని చెన్నయ్య, ఉమాదేవి దంపతులు భక్తులకు అన్న సంతర్పణం చేశారు. దేవస్థానం చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మన్నేపల్లి నరసింహుని ఆదాయం రూ.6.78 లక్షలు

బొల్లాపల్లి : శ్రీమన్నేపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆదాయం ఈ ఏడాది కొంత పెరిగిందని దేవదాయ శాఖ అధికారి ఎ.శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత ఏడాది రూ.6.68 లక్షలు రాగా ఈ సంవత్సరం రూ.6.78 లక్షల మేర ఆదాయం సమకూరిందని వివరించారు. విరాళాలు రూ.2.17 లక్షలు, హుండీ ఆదాయం రూ.1.65 లక్షలు, కొబ్బరికాయలకు రూ.1.25 లక్షలు ఇతరత్రా కలిపి మొత్తం ఆదాయం రూ.6.78 లక్షలు వచ్చిందని ఈవో వివరించారు.

శివయ్య కల్యాణం



వినుకొండ: మండలంలోని విఠంరాజుపల్లి గ్రామంలో హిమాలయ గురువు ఆశీస్సులతో శాంతి ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయి బృందావనంలో మహాశివరాత్రి సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి నిర్వహించారు. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు జాగారాలు చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు పెండేల వెంకటమోహన్‌రావు, కె.అనంత కోటేశ్వరరావు, పెండేల కాశీ, కొప్పురావూరి సుధాకర్, పెండేల పుల్లారావు, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామాలకు చేరిన ప్రభలు



నాదెండ్ల: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి సన్నిధికి చేరుకుని తిరిగి గురువారం భారీ విద్యుత్ ప్రభలు స్వగ్రామాలకు ప్రశాంతంగా చేరాయి. సాయంత్రం 6 గంటల సమయానికి అప్పాపురం, అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామ ప్రభలు ఎలాంటి ఆటంకాలు లేకుండా తిరిగి చేరటంతో ఆయా గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. మరో రెండు రోజుల్లో రెండు ప్రభలకు గ్రామోత్సవాలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. గతేడాది కన్నా ఈ ఏడాది వ్యయం పెరిగిందని నిర్వాహకులు చెప్పారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం గుర్తింపు



నరసరావుపేట రూరల్: మండలంలోని కోటప్పకొండ, కొండకావూరు పంచాయతీలోని సర్వ శిక్ష అభియాన్ స్కూల్ ఎదురుగా గురువారం సుమారు 50 నుంచి 55ఏళ్ల వయస్సు గల ఒక మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ కిషోర్ తెలిపారు. చిత్తు కాగితాలు, వాటర్ బాటిల్స్ ఏరుకుని జీవించే మహిళగా స్థానికులు చెబుతున్నారని, ఆ మహిళ చిరునామా తెలియ రాలేదని, ఆమె ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ, ఎస్ఐ 9440796244, 944079622 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

స్వల్ప వివాదాల నడుమ ఎమ్మెల్సీ ఎన్నికలు

- గురజాల, మాచర్ల నియోజకవర్గంలో 85శాతానికిపై పోలింగ్ నమోదు
- పిడుగురాళ్లలో టీడీపీ నేతల అత్యుత్సాహం..

పిడుగురాళ్ల: పట్టభద్రుల ఎన్నికలు పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగాయి. మధ్యాహ్నం నుంచి పోలింగ్ మందగించడం, ఎన్నికల అధికారులు ఎవరు అందుబాటులో లేకపోవడం, పోలీసులు కూడా నామమాత్రంగా ఉండటంతో కూటమి మద్దతుదారుకు దొంగ ఓట్లు వేసుకునేందుకు వెసులుబాటు కలిగింది. ఈ క్రమంలోనే పిడుగురాళ్ల సీపీఎం మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, అలాగే విద్యార్థి సంఘం నాయకులు కోటా సాయి కుమార్ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరుపున ఏజెంట్లుగా నిలబడి, వీరు దొంగ ఓట్లు వేసిన వారిని గుర్తించి అడ్డుకోవటంతో పట్టణంలోని అధికార కూటమి ప్రభుత్వ నాయకులు ఎన్నికల బూత్ వరకు చేరుకొని వాగ్వాదానికి దిగారు. ఓట్లు వేయటానికి వచ్చిన వారిని దొంగ ఓట్లు వేయటానికి వస్తున్నారని ఎవరైనా ప్రశ్నిస్తే ఊరుకునేది లేదని హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికి సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాసరావు రెండు, మూడు సార్లు వచ్చిన వారిని అడ్డుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. దీంతో పోలింగ్ ముగిసే సమయం ముందు ఒక్కసారిగా అధికార పార్టీ నాయకులు వాగ్వాదం దిగారు. దీంతో స్వల్ప గొడవ కాస్తా ఉద్రిక్తత్ర వాతావరణంగా మారింది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి గొడవను సదుమనిగింపజేశారు. స్వల్ప సంఘటనలు మినహా ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావు ఆధ్వర్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా జరిగేందుకు తన కృషి చేశారు.

88 శాతం పోలింగ్..

దాచేపల్లి: గుంటూరు, కృష్ణా పట్టభద్రుల నియోజక వర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం జరిగాయి. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 326 పోలింగ్ కేంద్రంలో 876 ఓట్లకు గాను 766, 327 పోలింగ్ కేంద్రంలో 761 ఓట్లకుగాను 662 ఓట్లు పోలయ్యాయి. 88శాతం పోలింగ్ సరళి జరిగినట్లు అధికారులు ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి ఓటు హక్కు వినియోగించుకున్నారు. గురజాల ఆర్డీవో మురళీ, తహశీల్దార్ మధుబాబు పోలింగ్ సరళి పరిశీలించారు.



పిడుగురాళ్ల మన్నెం పుల్లారెడ్డి హైస్కూల్‌లో బారులు తీరిన ఓటర్లు



పిడుగురాళ్ల హైస్కూల్ వద్ద పహారా కాస్తున్న పోలీస్ సిబ్బంది

రెంటచింతలలో 88.46శాతం



ఓటు హక్కు వినియోగించుకున్న చింతా గోవిందరాజు

రెంటచింతల: మండల కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. స్థానిక వైఆర్ఎస్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 323 పోలింగ్ బూత్‌లో 832 మంది ఓటర్లకు గాను 736 మంది ఓటు వేశారు. 88.46 శాతం ఓట్లు పోలైనట్లు పీఓ బోయపాటి బ్రహ్మారెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.

మాచర్లలో 83.6 శాతం పోలింగ్

మాచర్ల: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలో రింగ్‌రోడ్డు, సెయింట్ ఆన్స్ కాన్వెంట్‌లో ఐదు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం ఓటర్లు 3,560 ఉండగా, అందులో 2,546 ఓట్లు పోలయ్యాయి. 83.6 పోలింగ్ శాతం నమోదైంది. పోలింగ్ కేంద్రాలను పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, గురజాల ఆర్డీవో మౌళి, గురజాల డీఎస్పీ జగదీష్, అసిస్టెంట్ రిటరి్నంగ్ అధికారి ధూళిపాళ్ల వేణుబాబు పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అధికారులు బందోబస్తు నడుమన పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

పట్టణంలో 90.12 శాతం, రూరల్‌లో 93.70 శాతం

గురజాల : నియోజకవర్గ కేంద్రం గురజాలలో గురువారం జరిగిన కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. పట్టణంలో 830 ఓట్లకు గాను 748 ఓట్లు, రూరల్ పరిధిలో 667 ఓట్లకు గాను 625 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డీఎస్పీ బి.జగదీష్ ఆధ్వర్యంలో సీఐ ఆవుల భాస్కర్, ఎస్ఐ వై.వినోద్ కుమార్ బందోబస్తు నిర్వహించారు.

ప్రశాంతంగా పోలింగ్

విజయపురిసౌత్: గుంటూరు, కృష్ణా ఎంఎల్సీ ఎన్నికల పోలింగ్ మాచర్ల మండలం విజయపురి సౌత్ లో గురువారం ప్రశాంతంగా జరిగింది. స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాలలో 320 నంబరు పోలింగ్ కేంద్రంలో మొత్తం 343 ఓట్లు ఉండగా 273 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 208 మంది, స్త్రీలు 65 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 80 శాతం ఓటింగ్ నమోదు అయింది. ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మాచవరంలో 87.88 శాతం..

మాచవరం: మండలంలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 87.88 శాతం ఓట్లు పోలయ్యాయి. మండల కేంద్రంలో ఒకే ఒక్క బూత్‌లో 809 ఓట్లకు గాను 711 ఓట్లు నమోదు అయ్యాయి.

పిడుగురాళ్లల్లో 88.25 శాతం..

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు 88.25 శాతం ఓట్లు పోలయ్యాయి. హైస్కూల్‌లో మొత్తం నాలుగు ఎన్నికల బూత్‌లను ఏర్పాటు చేశారు. వాటిల్లో 329 బూత్‌లో 505 ఓట్లకు గాను 440 ఓట్లు, 329/ఏ పోలింగ్ బూత్‌లో 516 ఓట్లకు గాను 442 ఓట్లు, 330 బూత్‌లో 892 ఓట్లకు గాను 811 ఓట్లు, అలాగే 331 బూత్‌లో 978 ఓట్లకు గాను 840 ఓట్లు.. మొత్తం 2,891 ఓట్లకు గాను 2,533 ఓట్లు పోలయ్యాయి. మొత్తం మీద 88.25 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.



నరసరావుపేటలో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



గురజాలలో బారులు తీరిన ఓటర్లు



మాచర్ల: పోలింగ్ కేంద్రాల పరిశీలనలో ఎస్పీ కంచి శ్రీనివాసరావు

కోటప్పకొండలో రెడ్‌క్రాస్ సేవలు



నరసరావుపేట రూరల్: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండకు వచ్చిన యాత్రికుల కోసం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రథమచికిత్స కేంద్రం, అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి సేవలు అందించినట్లు రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహనరెడ్డి తెలిపారు. మెట్ల మార్గం, కాలినకడన వచ్చిన భక్తులకు 120 మందికి, జ్వరం, నీరసంతో బాధపడుతున్న 700 మందికి వైద్య శిబిరంలో చికిత్స అందజేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు వివరించారు. ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటుకు సహకరించిన ఆలయ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు విష్ణు, అక్షయ్, అఖిల్, శ్రీహరి, ఆనంద్, ప్రణవ్, ఆశిక్, అద్వైత్‌లు వైద్య శిబిరంలో సేవలు అందించారని వివరించారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



అచ్చంపేట: మహాశివరాత్రిని పురస్కరించుకుని స్థానిక హరిహర క్షేత్రంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవాలయంలో బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణ మహోత్సం కనుల పండువగా జరిగింది. ప్రముఖ వేదపండితులు పులుపుల ఫణి కుమార శర్మ స్వామి వారి కల్యాణాన్ని సంప్రదాయంగా నిర్వహించారు. ఆర్యవైశ్య ప్రముఖులు దంపత సమేతంగా పీటలపై కూర్చుని స్వామి వారి కల్యాణ తంతు జరిపించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు.

ట్రాఫిక్ జామ్‌తో తీవ్ర ఇబ్బందులు



ఏపీ జెన్‌కో ప్రధాన ద్వారం వద్ద ట్రాఫిక్ జామ్

సత్రశాల(రెంటచింతల): మహా శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి సత్రశాల వెళ్లే భక్తులు ట్రాఫిక్ జామ్ వల్ల తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సింగిల్ రోడ్డు కావడంతో పాటు బస్సులు, పరాశక్తికి వచ్చే లారీలు, గ్రామాల నుంచి దేవస్థానానికి తరలివచ్చే ప్రభలతో రాత్రి 9.30 గంటల నుంచి 12 గంటల వరకు రాకపోకలు నిలిచిపోయాయి. కొందరు భక్తులు వాహనాలను దారి మధ్యలో వదలి కాలి నడకన దేవస్థానం చేరుకున్నారు. ఇరుకు రహదారి కావడంతో పాటు భారీ సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, బస్సులు, లారీలు రావడంతో ట్రాఫిక్ జామ్ అయినట్లు భక్తులు తెలిపారు. గంటల తరబడి వాహనాలు రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడ్డారు. కారెంపూడి సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో ఎస్ఐలు 80 మంది పోలీసులతో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా మహా శివరాత్రి వేడుకలు ప్రశాతంగా జరగడానికి పటిష్టమైన చర్యలు తీసుకున్నారు.

వైభవంగా శివపార్వతుల ఊరేగింపు

సత్తెనపల్లి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారికి సారె కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అచ్చంపేటరోడ్‌లో గల దుర్గా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం వద్ద నుంచి శివపార్వతుల ఊరేగింపు అంగరంగ వైభవంగా గురువారం రాత్రి నిర్వహించారు. కళాకారులు వివిధ దేవతల రూపంలో అలంకరించుకొని ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చారు. ఆలయం వద్ద నుంచి బేతాళ వేషధారణలతో కనక తప్పెట్లు మేళతాళాలతో అఘోరాల ప్రదర్శనలతో ఊరేగింపు సాగింది. కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా దేవదాయ ధర్మదాయ శాఖ కార్యనిర్వహణాధికారి సనిమెళ్ళ కోటిరెడ్డి ఆధ్వర్యంలో కార్యనిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజాస్వామ్యానికి అధికార పార్టీ విఘాతం

అమరావతి: మండల పరిధిలోని స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన నాలుగు పోలింగ్ బూత్‌లలో గురువారం నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 2,352 మంది ఓటర్లకు గాను 1,830 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 77.8 శాతం పోలింగ్ నమోదైంది. సీఐ అచ్చియ్య బందోబస్తు నిర్వహించారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు ఈ రోజు జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో అధికార పార్టీ అక్రమాలకు తెరతీసి ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించిందన్నారు. అనేక చోట్ల పోలింగ్ ఏజెంట్లను బయటకు నెట్టి రిగ్గింగుకు పాల్పడిందన్నారు. దుర్గి, బెల్లంకొండ మండలాల్లో జరగుతున్న అక్రమాలపై ఎస్పీకి, రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తున్నామన్నారు. అధికార పార్టీ కార్యకర్తలు ఇష్టా రాజ్యంగా దొంగ ఓట్లు వేస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోగా అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలకటం దారుణమన్నారు. నైతికంగా తాము విలువలకు కట్టుబడి నైతిక విజయం సాధించామన్నారు. పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సరళిని పరిశీలించారు.

కన్నెగంటి హనుమంతును స్ఫూర్తిగా తీసుకోవాలి



కన్నెగంటి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ మోహన్, శ్రీనివాస్

రెంటచింతల: పల్నాటి స్వాతంత్ర్య ఉద్యమకారుడు, 'పుల్లరి' నిరాకరణ పోరాట యోధుడు కన్నెగంటి హనుమంతును నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సింహాద్రి మోహన్ పేర్కొన్నారు. కన్నెగంటి హనుమంతు వర్ధంతి వారోత్సవాల్లో భాగంగా గురువారం పాఠశాలలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్. శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, మాచర్ల–గుంటూరు ప్రధాన రహదారిపై మానవహారంగా ఏర్పాడ్డారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మోహన్ మాట్లాడుతూ కన్నెగంటి హనుమంతు పల్నాడు ప్రజలు పుల్లరి పన్ను నిరాకరణకు కృషి చేశారని కొనియాడారు. బ్రిటీష్ పాలకులు నిజాయితీపరుడు, శౌర్యవంతుడైన హనుమంతును 26 రౌండ్లు కాల్పులు జరిపి అంతమొందించారన్నారు. విద్యార్థులు, యువకులు హనుమంతును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గాదె లూర్దు మర్రెడ్డి, ఆవుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న భారతి, మెట్టు గోవిందరెడ్డి

మాచర్ల: పట్టణంలోని స్వామి వివేకానంద ఆశ్రమంలో యోగా మొదటి బ్యాచ్ ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. నెలరోజుల పాటు మాచర్ల రామకృష్ణా సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీశైలం రోడ్డులోని ఆశ్రమంలో.. ఆశ్రమ అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాల లెక్చరర్ భారతి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మనిషి జీవితంలో యోగా ప్రధాన భాగమన్నారు. యోగా వల్ల మానసిక సమస్యలను అధిగమించవచ్చన్నారు. యోగా ప్రయోజనాలు వివరించారు. మార్చి 3 నుంచి రెండో బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. యోగ ఉచిత శిక్షణలో పాల్గొనాలనుకునేవారు పేర్లు నమోదు చేసుకోవాలని మెట్టుగోవిందరెడ్డి సూచించారు. వివరాలకు 94400 06813కు సంప్రదించాలన్నారు.

ఒత్తిడిని దూరం పెడితే..వంద శాతం ఉత్తీర్ణత

- మార్చి 17 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు
- వంద శాతం ఉత్తీర్ణతపై దృష్టి పెట్టిన ఉపాధ్యాయులు
- ఒత్తిడిని దూరం చేసేలా విద్యార్థుల సందేహాల నివృత్తి



పరీక్షలకు సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

పిడుగురాళ్ల: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17న ప్రారంభం కానున్నాయి. గతం కంటే ఈ విద్యా సంవత్సరంలో అధిక ఉత్తీర్ణత శాతం సాధించేందుకు లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. శ్రద్ధతో చదువుకునే విధంగా ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు వచ్చిన సందేహాలను నివృత్తి చేస్తున్నారు. వంద శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పరీక్షలకు ముందు విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దని, ప్రశాంతమైన వాతావరణంలో పునశ్చరణ చేయాలని చెబుతున్నారు.

పరీక్షలకు సన్నద్ధం..

మార్చి 17వ తేదీ నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అటు విద్యార్థులకు, ఇటు తల్లిదండ్రులకు పరీక్షలు దగ్గర పడుతున్న కొద్దీ టెన్షన్ మొదలవుతోంది. విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో ఎటువంటి ఆందోళన చెందకుండా ఉండాలన్నారు. పిడుగురాళ్లలో మన్నెం పుల్లారెడ్డి జిల్లా జెడ్పీ ఉన్నత పాఠశాలలో 345 మంది, లెనిన్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 50 మంది, కేజీబీవీలో 38 మంది, సెయింట్ జోసఫ్ హైస్కూల్ 19 మంది, ఏపీటీడబ్ల్యూ ఆర్ స్కూల్ బాలురు 11 మంది, అలాగే ఏపీటీడబ్ల్యూ ఆర్‌లో 27 మంది, బ్రాహ్మణపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల 141, గుత్తికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 41, జానపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల 100, జూలకల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 45, కరలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 27, తుమ్మలచెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 64, వెంకటాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 14 మంది మొత్తం 2,128 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



పదో తరగతి పరీక్షల ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత శాతం లక్ష్యంగా శ్రమిస్తున్నాం. విద్యార్థులపై ప్రత్యేక తరగతులతో దృష్టి సారించాం. వారి సందేహాలను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పునశ్చరణ చేయిస్తున్నాం. వారి భయాందోళనలను ఇప్పటి నుంచే పోగొడుతున్నాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో–2, పిడుగురాళ్ల.

అన్ని సబ్జెక్టులపై పట్టు..



విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. విద్యార్థులకు ప్రత్యేక బోధన అందిస్తున్నాం. సాయంత్రం విద్యార్థులకు చిక్కీలు, జామపండ్లు వంటివి పౌష్టికాహారంగా అందిస్తున్నాం. పూర్తిస్థాయిలో విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమయ్యేలా దృష్టిసారించాం.

– ఎల్.ధనలక్ష్మి, హెచ్ఎం, మన్నెం పుల్లారెడ్డి ఉన్నత పాఠశాల.

వందే.. శివం శంకరం



యడ్లపాడు మండలం లింగారావుపాలెం శివాలయంలో ప్రత్యేక అలంకరణలో మహాశివుడు

యడ్లపాడు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని యడ్లపాడు మండలంలోని శైవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. లింగారావు పాలెంలోని గంగాపార్వతీ సమేత రామలింగేశ్వర రావు దేవస్థానం, యడ్లపాడు రాజరాజశ్వర స్వామి ఆలయం, బోయపాలెం హరిహరక్షేత్రం, జాలాది హరిహరదత్తక్షేత్రం, మైదవోలు, కొత్తపాలెం, కొండవీడు, తుర్లపాడు, దింతెనపాడు, జగ్గాపురం, కారుచోల, సొలస, సందెపూడి గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. ఉదయం నుంచి ఉపవాసాలు ఉన్న భక్తులు సాయంత్రం శివాలయాల్లో మహాశివునికి, పార్వతిదేవి అమ్మవారికి జరిగిన శాంతి కల్యాణ వేడుకలను తిలకించి తరించారు. బుధవారం రాత్రి లింగోద్భవ కాలంలో 12 గంటల నుంచి ఆదిదేవుడికి రుద్రాభిషేకంతో ప్రారంభించి 11 రకాల అభిషేకాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రంతా భక్తులు జాగారాలు చేశారు. వందే శివం శంకరం అంటూ నినదించారు.